సాక్షి
అనంతపురం
మంగళవారం । 26 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.34,100

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34,100 పలికాయి.



టమాట కిలో రూ.36

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.36 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.28 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/15.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్, ఎస్పీ విస్తృత పర్యటన



ఉద్దేహాళ్‌లో హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

బొమ్మనహాళ్: సీఎం చంద్రబాబు ఈ నెల 30న జిల్లాలో పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామాల ఎంపికకు సోమవారం బొమ్మనహాళ్ మండలం లోని ఉద్దేహాళ్, ఉప్పరహాళ్, ఉంతకల్లు, గోవింద వాడలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, సీఎంఓ టూర్ కో ఆర్డినేటర్ ఇక్బాల్ షకీల్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఉద్దేహాళ్‌లోని హైస్కూల్ మైదానాన్ని, రచ్చకట్టలను పరిశీలించారు. అనంతరం ఉప్పరహాళ్, ఉంతకల్లు గ్రామాలలో రచ్చకట్టలను పరిశీలించి అక్కడ ఏర్పాట్లు ఏ విధంగా ఉండాలనే దానిపై చర్చించారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో సీఎం ముఖాముఖిగా మాట్లాడనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్లు మునివేలు, అనిల్‌కుమార్, డీఎస్పీ రవిబాబు, ఎంపీడీఓ దాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ప్రత్యేక డ్రైవ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సోమవారం కూడా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రతి ఆటోను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, తదితర డాక్యుమెంట్స్ పరిశీలించారు. ప్రయాణికులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అత్యాశకు పోయి ఓవర్‌లోడ్‌తో వెళ్లడం వల్ల అటు ప్రయాణికులు, ఇటు డ్రైవర్లు ప్రమాదంలో చిక్కుకుంటున్నారని హితవు పలికారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన



కొత్తపేటలో పర్యటిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని పాత కొత్తపేట గ్రామంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పథకం పనులను కేంద్ర బృందం సభ్యులు డాక్టర్.ఎస్‌కే.కులశ్రేష్ట, జౌకికేశవన్‌లు సోమవారం పరిశీలించారు. అలాగే స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా గ్రామంలో చెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ తాగునీటిని అందించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం ప్రవేశ పెట్టి నిధులను మంజూరు చేసిందని, పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర బృందం సభ్యులు స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నసీమా సయ్యద్, ఏఈ రామలింగేశ్వరరెడ్డి, సర్పంచ్ గురుమస్తాన్, కార్యదర్శి వెంకటేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాలుగు ఆయుర్వేదిక్ కేంద్రాల మూసివేత

అనంతపురం: నగరంలోని ఆయుర్వేదిక్ మందుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.విజిలెన్స్ డీఎస్పీ ఎం. నాగభూషణం, సీఐ కే. శ్రీనివాసులు, ఏఓ జే. వాసు ప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్ (డ్రగ్స్) రమేష్ రెడ్డి దాడుల్లో పాల్గొన్నారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న కమలానగర్‌లోని మెహతా ఆయుర్వేద కేంద్రం,రామచంద్ర నగర్ మెయిన్ రోడ్‌లోని సుశ్రుత ఆయుర్వేద హాస్పిటల్, అరవింద నగర్‌లోని కేరళ ఆయుర్వేదం, సాయి నగర్‌లోని ధన్వంతరి మల్టీ స్పెషాలిటీ అండ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను మూసివేశారు. చట్టపరమైన చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ తెలిపారు. మొత్తం 6 ఆయుర్వేదిక్ షాపుల్లో తనిఖీ చేసి, నాలుగు షాపులను మూసివేసినట్లు పేర్కొన్నారు.

రహదారులపై రక్తపుటేరులు

- గార్లదిన్నె సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద ఘటన జిల్లావాసులను దిగ్భ్రాంతికి గురి చేసింది. వ్యవసాయ కూలి పనులు ముగించుకుని ఇంటికి ఆటోలో తిరిగి వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ఎనిమిది కూలీలు దుర్మరణం పాలవడం కలచివేసింది. ఇదే ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ల అవగాహన రాహిత్యంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.
- బొమ్మనహాళ్ మండలం శ్రీనివాసక్యాంప్ సమీపంలో ఇటీవల రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. సూపర్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తున్న దేవగిరి క్రాస్‌కు చెందిన కొండయ్యను బైకుపై మరో వ్యక్తి ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇలా జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.



- జాతీయ రహదారులపై మృత్యు ఘంటికలు
- ఓవర్ లోడ్‌తో తరచూ ప్రమాదాలు
- హై స్పీడుతో అదుపుతప్పి బోల్తా
- రోడ్డు ప్రమాదాల్లో నాలుగేళ్లలో 1,311 మంది మృత్యువాత
- వేగం తగ్గిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో రహదారులు రక్తంతో తడిసి ముద్దవుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట చోటుచేసుకుంటున్న ప్రమాదాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా శ్రుతి మించిన వేగంతో వెళుతుండటం ఊహించని ఘటనలకు దారి తీస్తున్నాయి.

అతివేగం.. ఓవర్ లోడుతోనే

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్రవాహనదారులే మృతి చెందుతున్నారు. దీనికి కారణం అతి వేగమేనని అధికారులు నిర్ధారించారు. అధిక సామర్థ్యం కలిగిన టూవీలర్లలో 140 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో వెళుతుండటంతో అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆటోల గురించి చెప్పాల్సిన పని లేదు. సాధారణంగా ఆటోలో తరలించాల్సింది ఆరుగురిని అయితే 15 నుంచి 20 మంది వరకూ తీసుకెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగి భారీగా ప్రాణ నష్టం వాటిల్లుతోంది. ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో ఎక్కువగా 22 ఏళ్లలోపు వారు ఉంటే, ఆటోల్లో ఎక్కువగా ప్రమాదానికి గురై చనిపోతున్నది పేదలు, కూలీలు కావడం గమనార్హం.

తెల్లవారుజామునే ఘటనలు..

పెద్ద పెద్ద ఘటనలు ఎప్పుడూ తెల్లవారుజామున 4 గంటల లోపే జరుగుతున్నాయి. ఇందుకు ప్రధానంగా డ్రైవర్లు నిద్రలేమితో ఉండటమే కారణమని వెల్లడైంది. లారీ డ్రైవర్లు రోజుల తరబడి డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక.. ద్విచక్రవాహన దారులు మితిమీరిన స్పీడు కారణంగా ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి జనాన్ని తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.



తలగాచిపల్లి క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని దెబ్బతిన్న ఆటో, రహదారిపై మృతదేహాలు (ఫైల్)

నాలుగేళ్లలో జిల్లాలో ప్రమాదాలు ఇలా

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	592	351	658
2022	540	331	588
2023	532	350	578
2024 (నవంబర్ 22)	384	279	461

మితిమీరిన వేగం వల్లే..



జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. గార్లదిన్నె ఘటనలో స్పీడ్ బ్రేకర్లు ఉన్నా ఆర్టీసీ డ్రైవర్ పట్టించుకోలేదు. ఆటో వైపు నుంచి చూస్తే ఓవర్ లోడు. అందుకే తనిఖీలు ముమ్మరం చేశాం. ఎలాంటి తప్పులు జరిగినా భారీగా పెనాల్టీలు వేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా ద్విచక్ర వాహనాలను నడిపే వారి పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి జాగ్రత్తగా వెళ్లమని చెప్పాలి.

– వీర్రాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రవాణా శాఖ

ఓవర్‌టేకే కొంప ముంచింది!

అనంతపురం సెంట్రల్: అవగాహన రాహిత్యంతో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడంతోనే తలగాచిపల్లి క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగినట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదంపై రవాణాశాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నారు. దుర్ఘటనకు దారితీసిన కారణాలపై లోతుగా ఆరా తీస్తున్నారు. మరోవైపు ఆర్టీఏ అధికారులు ఇప్పటికే నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిసింది. ఆటోడ్రైవర్ యూటర్న్ తీసుకుంటుండగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ గమనించలేదని తెలుస్తోంది. గార్లదిన్నె మండల కేంద్రంలోకి రాకపోకలు సాగించే వాహనాలు, తలగాచిపల్లి, తిమ్మంపేట గ్రామాలకు వెళ్లే వాహనాలకు అనువుగా ఆ ప్రాంతంలో జంక్షన్ ఏర్పాటు చేశారు. అతివేగంగా వాహనాలు వెళ్లకుండా స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. అయినప్పటికీ ఓవర్ టేక్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది. దీనికి తోడు జంక్షన్ ప్రాంతంలో లారీని కుడి వైపు నుంచి కాకుండా ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేసినట్లు సమాచారం. ఓవర్‌టేక్ చేయకపోయినా, స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు వేగం తగ్గినా కూలీలు సురక్షితంగా బయటపడేవారు. కాగా, గతంలో జేఎన్‌టీయూ వీసీ సైతం ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గమనార్హం. ఈ మార్గంలో ప్రమాదం జరిగిందంటే గాయాలతో బయటపడే పరిస్థితి లేదని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

దిద్దుబాటు చర్యలు..

తలగాచిపల్లి క్రాస్ వద్ద ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో దిద్దుబాటు చర్యలకు పోలీసు, రవాణాశాఖ యంత్రాంగం ఉపక్రమించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలను సీజ్ చేస్తున్నారు. అయితే, చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నష్టం జరిగిన తర్వాత రోడ్లపైకి వస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వినతిపత్రాలతో పోటెత్తారు

- కిటకిటలాడిన 'దుర్గం' ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- భూ సంబంధిత సమస్యలే అధికం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం: నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అర్జీలు వెల్లువెత్తాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమానికి ఏకంగా 662 వినతిపత్రాలు అందాయి. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ వసంత బాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష, డీపీఓ నాగరాజు నాయుడు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమా మహేశ్వరమ్మ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలపై ఎక్కువగా వినతి పత్రాలు అందాయి.

వినతుల్లో కొన్ని..

- కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌పై ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు చెలిమప్ప, దొణతిమ్మప్ప, చనమల్లి, నరసింహులు, నారాయణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న 10 మంది పారిశుద్ధ్య కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించి వారి పొట్ట కొట్టారన్నారు. బడా బాబుల ఇళ్ల నిర్మాణాలకు ముడుపులు తీసుకుని నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారని, పేదల ఇళ్లను మాత్రం కూల్చివేస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి అవినీతి, అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఏపీ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు బత్తుల కోదండరామిరెడ్డి కోరారు. జిల్లాలో 11 పీహెచ్‌సీల పరిధిలో 33 మందిని నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ వేసుకున్నారని, దీని వెనుక భారీ ఎత్తున డబ్బు చేతులు మారిందన్నారు. తనిఖీల ముసుగులో ప్రైవేట్ నర్సింగ్ హోం యజమానులతో సైతం లంచాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులతో డబ్బు వసూలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- 85 శాతం వికలత్వం ఉన్న తనకు పింఛన్ ఇప్పించాలని బ్రహ్మసముద్రం మండలం సంతేకొండాపురానికి చెందిన సురేష్ విన్నవించారు.
- కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లిలో ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటి పూర్తికి చర్యలు తీసుకోవాలని కళ్యాణదుర్గం సబ్ డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్ విన్నవించారు. కళ్యాణదుర్గం మారెంపల్లి కాలనీలోని గురుకుల పాఠశాలలో 40 మందికి ఒకే బాత్‌రూం, వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.
- కంబదూరు మండలం తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాలలో మురుగునీరు నిలిచి అపరిశుభ్రత తాండవిస్తున్నా ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ చైర్మన్ రాములు ఫిర్యాదు చేశారు. విద్యార్థినులు జ్వరాల బారిన పడినా కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలో పాఠశాలను తనిఖీ చేసి సమస్యలను పరిష్కరించాలని డీసీ ఓను ఆదేశించారు.

మండలాలకు జిల్లా యంత్రాంగం

సమస్యలకు పరిష్కారం చూపడం కోసం ఇకనుంచి మండలాలకు జిల్లా యంత్రాంగం వెళ్తుందని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'పై అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రయాస తగ్గించేందుకే రెవెన్యూ డివిజన్ల పరిధిలో కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు శాఖలో వచ్చే అర్జీలు సైతం నమోదు చేయాలని సూచించారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజలకు చక్కని అవకాశమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డీఎం నర్సింగరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంటాడిన పాపం..

- 26 ఏళ్ల క్రితం ఆరు నెలల పసిబిడ్డను హతమార్చిన తండ్రి
- అప్పటి నుంచి అజ్ఞాతంలోనే నిందితుడు
- పేరు మార్చుకుని కర్ణాటకలో తలదాచుకున్న వైనం
- నిందితుడి ఆచూకీ బయటపెట్టిన పెళ్లి కార్డు

పుట్టపర్తి టౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త చివరకు కన్నకొడుకును హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఒకటి.. రెండేళ్లు కాదు.. ఏకంగా 26 ఏళ్ల తర్వాత చేసిన పాపం పండింది. పేరు మార్చుకుని కర్ణాటకలో తలదాచుకున్న నిందితుడి ఆచూకీని పోలీసులు పసిగట్టి సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న వెల్లడించారు.

ఏం జరిగింది?

శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామికి అదే గ్రామంలో నివాసముంటున్న మేనత్త పల్లెమ్మ కుమార్తె కరియమ్మతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. 1998 ఏప్రిల్‌లో జన్మించిన రెండో కుమారుడికి శివలింగమయ్య అనే పేరు పెట్టి పెంచుకోసాగారు. ఈ క్రమంలో కరియమ్మ ప్రవర్తనపై తిప్పేస్వామికి అనుమానం మొదలైంది. రెండో కుమారుడు తనకు పుట్టలేదని, ఎలాగైనా ఆ పసివాడిని మట్టుబెట్టాలని అనుకున్నాడు. 1998 అక్టోబర్ 2న దసరా పండుగ సందర్భంగా ఉదయం కులాచారం మేరకు ఆరు నెలల పసికందును కరియమ్మ ఎత్తుకుని మారెమ్మ జమ్మి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో తిప్పేస్వామి బలవంతంగా లాక్కొని పక్కనే ఉన్న మామిడి తోటలోకి తీసుకెళ్లి గొంతు పిసికి చంపేశాడు. అక్కడే గొయ్యి తీసి పాతిపెట్టి పారిపోయాడు. ఘటనపై కరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



వివరాలు వెల్లడిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న

పేరు మార్చుకుని.. పెళ్లి చేసుకుని

పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుపోయిన తిప్పేస్వామి కర్ణాటకలోని హసన్ జిల్లా న్యామనహళ్లిలో స్థిరపడ్డాడు. తన పేరును కృష్ణగౌడ్‌గా మార్చుకుని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, ఇటీవల తన పెద్ద కుమార్తె పెళ్లి కుదరడంతో ఆహ్వాన పత్రికను దిన్నేహట్టిలోని తన స్నేహితుడు నాగరాజుకు తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ్ పంపాడు. ఎస్పీ రత్న ఆదేశాలతో పాత కేసుల దర్యాప్తు చేపట్టిన పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు.. విచారణలో భాగంగా కొన్ని రోజుల క్రితం దిన్నేహట్టి గ్రామానికి వెళ్లి తిప్పేస్వామి గురించి ఆరా తీశారు. ఆ సమయంలో నాగరాజు ఇంట్లో తిప్పేస్వామి కుమార్తె వివాహ ఆహ్వాన పత్రిక లభ్యమైంది. దీని ఆధారంగా తిప్పేస్వామి ఆచూకీని పోలీసులు గుర్తించారు.

పట్టుబడ్డాడు ఇలా...

తిప్పేస్వామి ఆచూకీని పసిగట్టిన తర్వాత న్యామనహళ్లికి వెళ్లి అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే..తన తమ్ముడు చిత్తప్పతో భూమి భాగ పరిష్కారం కోసం స్వగ్రామానికి వచ్చిన తిప్పేస్వామి సోమవారం ఉదయం పెద్ద మనుషుల కోసం మండలపల్లి బస్టాండ్ వద్ద వేచి ఉండగా సీఐ రాజ్‌కుమార్ గుర్తించి అదుపులోకి తీసుకుని ఎస్పీ ఎదుట హాజరుపరిచారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో చేసిన నేరాన్ని అంగీకరించాడు.



తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివయ్య ఆకారంలో మహిళలు వెలిగించిన దీపాలు

శంభో శంకర..

హరహర మహాదేవ శంభోశంకర, ఓం నమః శివాయ నామస్మరణతో జిల్లాలోని శివాలయాలు మార్మోగాయి. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివయ్య కొలువైన క్షేత్రాలు విద్యుద్దీప కాంతుల నడుమ వెలుగులీనాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం







అనంతపురంలోని పాతూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

క్రీడలతో మానసికోల్లాసం



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్

బుక్కరాయసముద్రం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో 3వ క్రీడా మహోత్సవ్-2024 ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ప్రభుకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు ఒత్తిడి తగ్గించుకునేందుకు రోజూ యోగా, వ్యాయామం చేయాలన్నారు. ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడలు మనసుకు ఉత్తేజాన్నిస్తాయన్నారు. బెటాలియన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, పోలీసు సిబ్బంది సహకరించాలన్నారు. సిబ్బందికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వేతన బకాయిలు చెల్లించండి'



సమస్య చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన కేజీబీవీ ఆయాలు

అనంతపురం అర్బన్: ఏడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కేజీబీవీ గురుకుల పాఠశాలల ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలంటూ అధికారుల వద్ద తమ గోడు వెళ్లబోసుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే పరిష్కార వేదిక కార్యక్రమం లేదని తెలిసి నిరాశకు గురైన వారు అక్కడున్న సిబ్బందికి అర్జీ సమర్పించి వెనుతిరిగారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్, ఆయాలు చాముండేశ్వరి, నాగలక్ష్మి, జ్యోతి మాట్లాడుతూ తమ పరిస్థితిని వివరించారు. జిల్లావ్యాప్తంగా కేజీబీవీ గురుకుల పాఠశాలల్లో దాదాపు 1,800 మంది టాయ్‌లెట్లు శుభ్రపరిచే ఆయాలుగా రెండేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. నెలసరి రూ.6వేలు వేతనంతో పనిచేస్తున్న తమలో కొందరికి నాలుగు నెలలు, మరికొందరికి ఏడు నెలలుగా వేతనం అందలేదన్నారు. అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీశైలంలో కళ్యాణదుర్గం వాసి మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కామక్కపల్లికి చెందిన మల్లికార్జున(56) సోమవారం ఉదయం శ్రీశైలంలో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం దైవదర్శనం కోసం శ్రీశైలం వెళ్లిన ఆయన సోమవారం ఉదయం కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పిస్తుండగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలయ అధికారుల నుంచి సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అప్రమత్తం చేయడంతో మృతుడి కుటుంబసభ్యులు శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు.

మళ్లీ రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్



బాషాను పోలీసులకు అప్పగిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో మరోసారి గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. పట్టణంలోని క్రిష్టాపురం 5వ రోడ్డులో నెల రోజుల క్రితం హంగామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం కూడా గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. కర్రలు చేతపట్టుకొని ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఆకతాయిలు నానా రభస చేశారు. కాలనీవాసులు పెద్దిరెడ్డి, రాధిక దంపతుల ఇంటిపై దాడికి పాల్పడారు. సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకోగా అక్కడి నుంచి ఉడాయించారు. అయితే, గంజాయి బ్యాచ్‌లోని బాషా అనే యువకున్ని కాలనీ వాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామనే తమపై దాడికి పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూమి.. ప్రైవేట్ లేఔట్!

- రూ. కోట్లు స్వాహాకు సిద్ధమైన టీడీపీ నేతలు
- ఎంచక్కా పసుపు రంగు రాళ్లు నాటిన వైనం



ప్రభుత్వ భూమిలో ప్లాట్లు వేసి పసుపు రంగు రాళ్లు నాటిన దృశ్యం

రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం రూరల్ మండలంలో తెలుగుదేశం పార్టీ చోటా నాయకులు రెచ్చిపోతున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఏకంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని లేఔట్లు వేసి రూ. కోట్లు అక్రమార్జనకు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో తమ దోపిడీ పర్వానికి ఎవరూ అడ్డు రాకుండా ఉండేందుకు రాప్తాడు నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య నాయకుడి పేరు చెప్పుకుని అక్రమాలకు తెరలేపడం చర్చనీయాంశమైంది. కాగా, అక్రమార్కులకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పంచాయతీ అధికారులూ సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

ఇదీ అసలు కథ...

కొడిమి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 235లో ఐదెకరాల భూమిని 1976లో బసవశెట్టి లక్ష్మమ్మ అనే మహిళకు అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసింది. ఈమె ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తుండేది. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మమ్మ మరణానంతరం ముగ్గురిలో ఒకరైన బసవశెట్టి కాంతమ్మ పేరును రికార్డుల్లో ఎక్కించారు. ఈమెకు సంతానం లేరు. ఈ భూమిలో ఎలాంటి పంటల సాగు లేకపోవడంతో 2012లో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. దీనిపై కాంతమ్మ అభ్యంతరం చెప్పడంతో గుడిసెలు వేసుకున్న బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. తర్వాత జరిగిన పరిణామాల్లో భాగంగా గుడిసెలు వేసుకున్న మూడు ఎకరాలు పోను కాంతమ్మకు రెండు ఎకరాలు మిగిలింది. అయితే కాంతమ్మకు వారసులు ఎవరూ లేకపోవడంతో ఆమె సోదరి కుమారుడు రంగంలోకి దిగాడు. రెండెకరాల భూమి తనదేనంటూ అధికారుల చుట్టూ తిరిగాడు. 2018లో నకిలీ మ్యానువల్ పాస్‌బుక్ సృష్టించాడు. వాస్తవానికి అప్పటికే రెవెన్యూ రికార్డులన్నీ ఆన్‌లైన్ వ్యవస్థలోకి వెళ్లాయి. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు వెళ్లడంతో గతంలో ఆర్డీఓ మధుసూదన్ విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి విచారణ చేసి మ్యానువల్ పాస్‌బుక్ నకిలీదని నిర్ధారిస్తూ ఆర్డీఓకు నివేదిక ఇచ్చారు. కాగా...కాంతమ్మ సోదరికి చెందిన మరో ఇద్దరు కుమారులు సైతం ఈ భూమిపై తమకూ వాటా ఉందంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ వివాదం నడుస్తోంది.

కూటమి ప్రభుత్వం రాగానే లేఔట్

కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీకి చెందిన కొందరు చోటా నాయకులకు ఈ భూమిపై కన్ను పడింది. వివాదస్పదం, అందులోనూ ప్రభుత్వ అసైన్డ్ భూమి అని తెలిసి తక్కువ ధరకు కాంతమ్మ సోదరి కుమారుడితో కొనుగోలు చేశారు. ఈ భూమిపై ఏవైనా ఇబ్బందులున్నా తాము చూసుకుంటామని భరోసానిచ్చారు. అంతే చకచకా భూమిని చదును చేసి ప్లాట్లు వేసి అమ్మకాలకు పెట్టారు. లేఔట్ అంటే ఖచ్చితంగా పంచాయతీ అనుమతులు ఉండాలి. అయితే ఇక్కడ వేసిన లేఔట్‌కు ఎలాంటి అనుమతులు లేవు. అయితే పసుపు రంగు రాళ్లు నాటితే తమకు అడ్డుచెప్పే అధికారులే ఉండరని భావించిన టీడీపీ నేతలు ఆ దిశగా కార్యాచరణ చేపట్టారు. సెంటు దాదాపు రూ. 3 లక్షల ధర నిర్ణయించి విక్రయాలకు తెరలేపారు. ఈ లెక్కన ఈ భూమి విలువ రూ. 4 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఈ వ్యవహారమంతా తెలుసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూన్నెళ్ల కిందటే ఈ లేఔట్ వేసినా ఇప్పటి వరకూ కనీసం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం ఇందుకు నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లేఔట్ వేసిన విషయం తెలీదు



కొడిమి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 235–2లో ఉన్న ప్రభుత్వ భూమిలో లేఔట్ వేసిన విషయం నాకు తెలీదు. ప్రభుత్వ భూమిలో ప్లాట్లు ఎలా వేస్తారు?. అక్కడి అసైన్డ్ భూమికి సంబంధించి సోదరుల మధ్య టైటిల్ డిస్పూట్ ఉంది. హైకోర్టులోనూ, జాయింట్ కలెక్టర్ వద్ద విచారణ జరుగుతోంది. మరోవైపు పట్టా రద్దు చేసి ఈ భూమిని స్వాధీనం చేసుకోమని గతంలో ఆర్డీఓ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై జేసీ వద్ద అప్పీలు వేశారు. హైకోర్ట్ నుంచి స్టేటస్‌కో ఆదేశాలు వచ్చాయి. కౌంటరు వేస్తున్నాం. పూర్తి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తాం. ఇంత వివాదం ఉన్న ప్రభుత్వ భూమిలో ప్లాట్లు వేయడాన్ని సీరియస్‌గా తీసుకుంటాం. ఆ ప్లాట్లు ఎవరూ కొనుగోలు చేయొద్దు. రిజిస్ట్రేషన్‌లు కూడా జరగవు.

– మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం

జాతీయ స్థాయి బధిరుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: స్థానిక ఆర్డీటీ స్టేడియం వేదికగా జాతీయ స్థాయి బధిరుల క్రికెట్ టోర్నీ (అండర్–19) సోమవారం ప్రారంభమైంది. వినికిడి లోపం ఉన్న పురుషుల 8 జట్లు పాల్గొన్నాయి. ఈ నెల 28న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కేన్ పిన్ హోమ్ లిమిటెడ్ మేనేజర్ వి.దేవరాజ్, ఏసీఏ కోచ్ యుగంధర్‌రెడ్డి, డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు కె.గోపీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఐడీసీఏ అధ్యక్షుడు సుమిత్ జైన్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి క్రికెట్ మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం పెంపొందించేలా పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా నగదు బహుమతిని అందజేశారు.

నగరంలో డ్రోన్‌ల పహారా

అనంతపురం: నగరంలోని వన్ టౌన్, ఫోర్త్ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిల్లోని శివారు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పహారా చేపట్టారు. ఈ క్రమంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురు పట్టుబడడంతో వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను పంపి నిఘా పెంచారు.

పక్కాగా 'పశుగణన'

- జిల్లా వ్యాప్తంగా చురుగ్గా సాగుతున్న ప్రక్రియ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28లోపు పూర్తి చేసేలా ప్రణాళిక
- సర్వే ఆధారంగానే పథకాల రూపకల్పనకు అవకాశం
- ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేంద్ర ప్రభుత్వం



జిల్లాలో పశు సంపద వివరాలు..	
ఆవులు	2.16 లక్షలు
గేదెలు	1.09 లక్షలు
గొర్రెలు	22.94 లక్షలు
మేకలు	4.12 లక్షలు
కోళ్లు	10.36 లక్షలు

రాయదుర్గం: జిల్లాలో 2018 తర్వాత 21వ అఖిల భారత పశుగణన సర్వే ఈ నెల 25న ప్రారంభం కాగా, ఈ ప్రక్రియ ప్రస్తుతం అన్నీ గ్రామాల్లోనూ ముమ్మరంగా సాగుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీలోపు ఈ ప్రక్రియను ముగించేలా అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లతో పాటు మరింత సిబ్బందిని నియమించుకున్నారు. ఈ కార్యాచరణలో జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది ఎన్యుమరేటర్లు, 42 మంది సూపర్‌వైజర్లు నిమగ్నమయ్యారు. వీరంతా ఊరురా తిరుగుతూ పశువులు, జీవాలు, గుర్రాలు, ఒంటెలు, పందులు, కుక్కలు, కుందేళ్లు, బాతులు, కోళ్లు ఇతర మొత్తం 16 రకాల పశువులను లెక్కించి 'ఆల్ ఇండియా లైవ్ స్టాక్ సెన్సస్' యాప్‌లో నమోదు చేస్తున్నారు. అలాగే పశు సంవర్ధక శాఖ అందజేసిన సామగ్రిని కూడా అందులో పొందుపరుస్తున్నారు.

ప్రణాళికల అవసరాల కోసమే

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పశు సంవర్ధక శాఖ నుంచి ఏకంగా 11 శాతం ఆదాయం సమకూరుతోందని లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశ ఆర్థికాదాయంలో గణనీయమైన పాత్ర పోషిస్తున్న పశుసంపద అభివృద్ధి, సంక్షేమం కోసం పశుగణన ప్రక్రియ తప్పనిసరిగా మారింది. ఏ జాతి పశువుల సంతతి ఎంత ఉంది? ఏది తగ్గుతోంది? ఏది పెరుగుతుంది? అనే విషయం గణన ద్వారా సులభంగా తెలుస్తోంది. ఈ క్రమంలో అంతరిస్తున్న జాతుల ఉత్పత్తికి అవసరమయ్యే చర్యలు చేపట్టేందుకు పశుగణన దోహదపడుతుంది. జిల్లాలో పశు పోషణపై పత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2.80 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు తదితర పశుపక్షాదులు సుమారు 5 లక్షలకు పైగా ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

రైతులు సహకరించాలి

పశు గణనకు వచ్చే ఎన్యుమరేటర్లకు రైతులు సహకరించాలి. వారి వద్ద ఉన్న పశుసంపద వివరాలు తెలియజేయాలి. లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. జిల్లాలో ఏయే జాతుల పశువులు ఎన్ని ఉన్నాయనే విషయం స్పష్టంగా తెలిస్తే వాటికి అనుగుణంగా పశుసంవర్ధకశాఖ ద్వారా మందులు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి సాధ్యమవుతుంది.

– జీపీ వెంకటస్వామి, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ

పరారీలో పేకాట నిర్వాహకుడు

శింగనమల: మండలంలోని ఇరువెందల గ్రామ శివారున స్థావరం ఏర్పాటు చేసి పేకాట ఆడిస్తున్న నిర్వాహకుడు పరారీలో ఉన్నాడని సీఐ కౌలుట్లయ్య తెలిపారు. ఆదివారం రాత్రి పేకాట ఆడుతూ 26 మంది పట్టుబడిన విషయం తెలిసిందే. రూ.13,18,560 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 23 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో జూదరులను సోమవారం ఉదయం అరెస్ట్ చూపించారు. అనంతరం శింగనమల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. తాడిపత్రికి చెందిన ఖాదిర్ వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించేందుకు పేకాట నిర్వహణను ఎంచుకున్నాడు. ఈ క్రమంలో అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో తనకు పరిచయమున్న ప్రముఖలను ఫోన్ చేసి రప్పించుకుని ముళ్లపొదలను అడ్డగా చేసుకుని పేకాట ఆడించసాగాడు. తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో స్థావరాలు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో శింగనమల మండలం ఇరువెందల గ్రామ శివారులో పెద్ద ఎత్తున పేకాట జరుగుతున్న సమాచారం అందుకున్న ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటసులు పర్యవేక్షణలో ఆదివారం రాత్రి తనిఖీలు చేపడితే పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. పరారీలో ఉన్న నిర్వాహకుడి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. జూదరులను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

కారులో మంటలు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలోని రాంనగర్ అంబేడ్కర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రాయదుర్గం పట్టణానికి చెందిన ఓబులేసు, తన భార్య, ఇద్దరు పిల్లలతో కలసి అనంతపురానికి కారులో వచ్చారు. ఆస్పత్రికి చేరుకునేందుకు రాంనగర్ మీదుగా అంబేడ్కర్ బ్రిడ్జిపై వెళ్తూ ఏసీ ఆన్ చేశారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. అప్రమత్తమైన దంపతులు వెంటనే పిల్లలను తీసుకుని కారు దిగారు. దగ్గర్లో ఉన్న ఫైర్ సిబ్బంది గమనించి అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే కారులో ఉన్న సీట్లు దగ్ధమయ్యాయి.

జగన్‌తోనే కురుబల ఆత్మగౌరవం పదిలం

- మాజీ మంత్రి మాలగుండ్ల, మాజీ ఎంపీ గోరంట్ల



భక్త కనకదాస పూజలో పాల్గొన్న మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్లమాధవ్, తదితరులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో కురుబల ఆత్మగౌరవం పదిలంగా ఉంటూ వచ్చిందని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి కురుబలు తలెత్తుకునేలా చేశారని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లిలో సోమవారం నిర్వహించిన భక్త కనకదాస జయంతి వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. భక్త కనకదాస విగ్రహానికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం శంకరనారాయణ మాట్లాడుతూ... తాను మంత్రిగా ఉన్న సమయంలో భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలన్న విజ్ఞప్తి మేరకు అప్పటి సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించి వెంటనే జీఓ విడుదల చేశారని గుర్తు చేశారు. సమాజంలో మార్పుకోసం కృషి చేసిన మహనీయుడు కనకదాస జీవిత చరిత్ర చూస్తే విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనేది కనకదాస ఆశయమన్నారు. ఆనాడే ఉన్నత చదువులు అభ్యసించి సమాజాన్ని అన్ని కోణాల్లో అధ్యయనం చేసిన కనకదాస.. కుల వివక్షతకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేశారన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ... భక్త కనకదాస మార్గం అందరికీ ఆచరణయోగ్యమన్నారు. ఐక్యమత్యంతోనే కురుబలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో గొరవయ్యలకు పాలు పోసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నసనకోట ముత్యాలమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముత్యాలు, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు బిల్లే నరేంద్ర, జిల్లా కార్యదర్శి వెంకటాపురం మురళి, ఎంపీటీసీ రుక్మిణమ్మ, కురుబ సంఘం నాయకులు పసుపుల ఆది, నరసింహగౌడ్, రాజహంస శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీ విజేత విజయనగరం



విజేత ట్రోఫీని అందుకుంటున్న విజయనగరం జట్టు క్రీడాకారులు



వైఎస్సార్ జిల్లా జట్టుకు రన్నరప్ ట్రోఫీని ప్రదానం చేస్తున్న దృశ్యం



మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

వజ్రకరూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ టోర్నీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ వేదికగా అండర్ 17 ఎస్‌జీఎఫ్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్కంఠగా సాగాయి. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొనగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా జట్టుపై విజయనగరం జట్టు గెలుపొంది విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో వైఎస్సార్ జిల్లా, మూడో స్థానంలో అనంతపురం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలు, పతకాలను డీవైఈఓ శ్రీదేవి ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని క్రీడాకారులకు ఆమె పిలుపునిచ్చారు. జాతీయ జట్టులో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయగా, ఇందులో కొనకొండ్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సాయి కార్తీక్‌కు చోటు దక్కడంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టోర్నీ అబ్జర్వర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎసత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మొరార్జీయాదవ్, సర్పంచ్ ఇందిరమ్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురేష్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు. కాగా, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఓ మృతి



ప్రశాంత్ (ఫైల్)

తాడిపత్రిటౌన్: స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన వీఆర్‌ఓ ప్రశాంత్(32) బెంగుళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ నెల 13న విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్న ఆయన బాత్‌రూంలో స్నానం చేస్తున్న సమయంలో గీజర్ గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఊడల మర్రి..



ఆత్మకూరులోని మర్రి చెట్టు

ఆత్మకూరు: ఎటు చూసినా కాంక్రీట్ జంగిల్ పెరిగిన నేటి ఆధునిక సమాజంలో భారీ వృక్షాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. ఎక్కడైనా ఓ భారీ వృక్షం కనిపిస్తే వెంటనే సెల్ఫీలతో సందడి చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి అరుదైన భారీ వృక్షాలు ఆత్మకూరుతో పాటు ఇదే మండలం మదిగుబ్బ గ్రామంలో కనువిందు చేస్తున్నాయి. శతాబ్దాల నాటి మర్రి చెట్లు ఊడలు దిగి అటుగా వెళుతున్న వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వేసవిలో గ్రామస్తులు చాలా మంది ఆ మర్రి చెట్ల కిందనే సేద తీరుతుంటారు.

గరిటెడైన చాలు ఖరము పాలు..



గాడిద పాలు విక్రయిస్తున్న ఆదిలాబాద్ వాసి

గంగిగోవు పాలు గరిటెడైనను చాలు ... అని లోకానికి ఎలుగెత్తి చాటిన వేమన... ఇప్పటి పరిస్థితులను ఆనాడే అంచనా వేసి ఉంటే 'గరిటెడైనను చాలు ఖరము పాలు' అంటూ పద్యాన్ని తిరగ రాసేవారేమో. ఎందుకంటే, గరిటెడు గాడిద పాల ధర కడివెడు గంగిగోవు పాల ధర కంటే ఎక్కువే మరి. తెలంగాణలోని ఆదిలాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తాడిపత్రిలో గత కొన్ని రోజులుగా గాడిద పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. గాడిద పాలను తాగడం ద్వారా చాలా వ్యాధులు దూరమవుతాయని చాలా మంది నమ్ముతున్నారు. చిన్నారులకు గాడిద పాలు పట్టిస్తే జీర్ణశక్తి మెరుగుపడుతుందని నమ్మకం. దీంతో 100 ఎం.ఎల్. గాడిద పాలను రూ.100 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఈ లెక్కన రోజూ రూ.వెయ్యి వరకు ఆదాయం ఉంటోందని ఆదిలాబాద్‌కు చెందిన రేఖ అంటున్నారు.

– తాడిపత్రి రూరల్

కులగణనతోనే బీసీలకు న్యాయం

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు



కలెక్టరేట్ వద్ద నిరసనకు ర్యాలీగా వస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: జనాభాలో 52 శాతం ఉన్న బీసీలు అన్నివిధాల అణచివేతకు గురవుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.బి.భాస్కర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కులగణనతోనే బీసీలకు రాజ్యాంగబద్ధమైన ప్రయోజనాలు చేకూరతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టనున్న జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టాలంటూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్‌బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు సమగ్ర కులగణన జరిపించలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లోనూ రాయితీలు, రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. అయితే వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలకు రాజ్యాంగబద్ధమైన ప్రయోజనాలు అందడం లేదన్నారు. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు, రాయితీలు సక్రమంగా అమలు కావాలన్నా, వారు సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నా, భవిష్యత్తులో రిజర్వేషన్లపై ఆచరణాత్మక విధానాలు రూపొందించాలన్నా కులాల జనాభాను సమగ్రంగా లెక్కించాలని అత్యున్నత న్యాయస్థానం తెలిపిందన్నారు. ఓబీసీల అభివృద్ధితోనూ దేశాభివృద్ధి ముడిపడి ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనగణనతోపాటు సమగ్ర కులగణన జరిపించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు డీకే రామలింగం, అనిల్‌కుమార్, లక్ష్మీనారాయణ, కేశవ కుమార్‌గౌడ్, రమాదేవి, చంద్రమౌళి, గోల్డ్ రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘పరిష్కార వేదిక’కు 163 వినతులు



కలెక్టరేట్ ఆవరణలో అర్జీలు స్వీకరిస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 163 వినతులు అందాయి. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికను రద్దు చేసి.. కళ్యాణదుర్గం పట్టణంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ విషయం తెలియని చాలా మంది ప్రజలు అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో వారిని వెనక్కి పంపించకుండా అక్కడి సిబ్బంది అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 163 వినతులు అందాయి. వాటన్నింటినీ పరిష్కార వేదిక కార్యక్రమ ఇన్‌చార్జి తహసీల్దార్‌తో అనుమతి తీసుకుని ఆన్‌లైన్ చేసి ఆయా శాఖలకు పంపిస్తామని అధికారులు తెలిపారు. అదే విధంగా అర్జీదారుల ఫోన్‌కు మెసేజ్ పంపించడంతో పాటు, అర్జీదారులు వస్తే రశీదు ఇస్తామని సిబ్బంది తెలిపారు.

శ్రీచైతన్యలో సేఫ్ ఇండియా



ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం సేఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ చిన్నారులు ప్లకార్డులతో కాలనీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తదితర రక్షణ పరికరాలతో ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, అకడమిక్ కో–ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు ఉత్పన్న ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: భావసారక్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నగరంలోని రామనగర్‌లో వెలసిన రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకంలో వచ్చే ఉత్పన్న ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6:30 గంటల నుండే వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 8 గంటలకు రుక్మిణి పాండురంగస్వామి నిజపాద దర్శనం, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు.

పరామర్శ



క్షతగాత్రులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం మెడికల్: ఈనెల 23న గార్లదిన్నె తలగాసిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బస్సు, ఆటో ఢీకొన్న విషయం విదితమే. అందులో గాయపడిన వారు కిమ్స్–సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం క్షతగాత్రులను మంత్రి పయ్యావుల కేశవ్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

అహుడా చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా టీసీ వరుణ్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం అహుడా కార్యాలయంలో ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో పాటు టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, అధికారులు వరుణ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ.. అనంతపురం, హిందూపురం డెవలప్‌మెంట్‌కు కృషి చేస్తామన్నారు. నిబంధనల మేరకు నడుచుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి గౌరీ శంకర్, పీఓ ఇసాక్ అహ్మద్, ఈఈ దుశ్యంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవా స్ఫూర్తి

ఆత్మకూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఔదార్యం



1992-93 బ్యాచ్ గుర్తుగా ఏర్పాటు చేసిన గేట్, పాఠశాల ముఖద్వారం

- సేవా కార్యక్రమాల్లో ముందంజ
- పాఠశాల అభివృద్ధికి ముందుకొస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: వారందరూ ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో కష్టపడి చదువుకున్నారు. ఇందులో చాలా మంది వ్యవసాయ కూలీల పిల్లలు. నాడు కష్టపడి చదివి.. నేడు ఉన్నత స్థాయికి ఎదిగారు. ఏటా ఏదో ఒక బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించే వారు. తమ జీవితాలకు బాట వేసిన పాఠశాలకు ఏదైనా చేయాలని నిత్యం పరితపించేవారు. పాఠశాలలకు ఏమేమి అవసరమో గుర్తించారు. విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలు, తాగునీరు, వాటర్‌ప్లాంట్, పాఠశాల ఆవరణలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఇలా ఒక్కొక్క పూర్వ విద్యార్థి పాఠశాల అభివృద్ధికి తీసుకుంటున్న చొరవ చాలామందిని కదిలించింది. పూర్వ విద్యార్థుల సహకారంతో ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది.

బ్యాచ్ గుర్తుండి పోయేలా..

పాఠశాలకు పురాతన గేట్ ఉండటంతో 1992–93 సంవత్సరానికి చెందిన పదో తరగతి 80 మంది పూర్వ విద్యార్థులు కలసి తాము చదివిన పాఠశాలకు గుర్తుకు పాఠశాలకు పెద్ద ముఖద్వారం, పెద్ద గేటును రూ.3.50 లక్షలు ఖర్చుతో ఏర్పాటు చేయించారు. 1994–95 బ్యాచ్‌కు చెందిన బాబూ ప్రసాద్ అనే పూర్వ విద్యార్థి పాఠశాలకు అభివృద్ధికి (చిల్డ్రన్స్ డే సందర్భంగా) రూ.లక్ష అందించారు. అదే విధంగా 1883–84 బ్యాచ్‌కు చెందిన మల్లికార్జున రెడ్డి అనే పూర్వ విద్యార్థి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష ఖర్చు పెట్టి ల్యాబ్ మెటీరియల్ సమకూర్చారు. అదే విధంగా 1962–63 సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ రూ.1.15 లక్షలు విలువ చేసే క్రీడానిధిని అందజేశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి మేదర చిన్నప్ప రూ.లక్ష వ్యయంతో సభా వేదికను నిర్మించారు. 1990–91 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు నీటి ట్యాంక్ ఏర్పాటు చేయించారు. ఇక 1979–80 సంవత్సర పూర్వ విద్యార్థులు లైబ్రరీ ర్యాక్‌లను వితరణ చేశారు. ఇదే కోవలో రాజశేఖర్‌రెడ్డి అనే విద్యార్థి రూ.25 వేలతో పాఠశాలకు ఫ్యాన్లు అందజేశారు. అంతేకాకుండా 1883–84 పూర్వ విద్యార్థులు పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం, 1989–90 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు వినాయకుడి విగ్రహం, 1991–92 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని తమ బ్యాచ్‌ల జ్ఞాపకార్థం పాఠశాలలో ఏర్పాటు చేయించారు. పూర్వ విద్యార్థులే కాకుండా గ్రీన్‌కో కంపెనీ వారు రూ.లక్షతో సైన్స్ ల్యాబ్ మెటీరియల్, రిటైర్డ్ టీచర్ శివారెడ్డి సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు.

‘భవానీ’.. సేవల్లో మేటి

ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల్లో భవానీ ప్రసాద్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. తాను చదివిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో పాఠశాల పేరిట రూ.లక్ష డిపాజిట్ చేశారు. అదే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేయించారు. పాఠశాలలో టేబుళ్లు, డెస్కుల మరమ్మతులకు రూ.1.25 లక్షలు అందించారు. అంతేకాకుండా ఏటా పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.7,500 అందిస్తూ విద్యార్థులు బాగా చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. మరో రూ.25 వేలను పాఠశాల ఖర్చులకు అందజేస్తున్నారు. ఇలా ఆయన.. తాను చదివిన పాఠశాలకు సేవ చేస్తుండటంతో చాలా మంది విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అడుగులు వేస్తున్నారు.



పూర్వ విద్యార్థులు నిర్మించిన షెడ్, స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహాలు



పూర్వ విద్యార్థి డాక్టర్ భవానీ ప్రసాద్ అందించిన వాటర్ ఫిల్టర్

నాడు విద్యార్థులు.. నేడు ఉపాధ్యాయులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న శ్రీనివాస మూర్తి, శ్రీనివాసులు, రామాంజనేయులు ఆత్మకూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. క్రమశిక్షణతో విద్యనభ్యసించారు. పోటీ పరీక్షల్లో రాణించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రస్తుతం వీరు చదివిన పాఠశాలలోనే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పిల్లలకు విద్యా బోధన చేస్తున్నారు. వీరి పదో తరగతి బ్యాచ్ పాఠశాలలో చాలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఇలా పాఠశాలను అభివృద్ధి చేయడం ఎంతో ఆనందంగా ఉందని చెబుతున్నారు.

పాఠశాలను మరువలేం..



మాది వ్యవసాయం కుటుంబం. మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ మమ్మల్ని కష్టపడి చదివించారు. వారి కష్టాన్ని చూసి ఉన్నతస్థాయికి ఎదగాలని పట్టుదలతో చదివాను. కర్నూల్ మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్‌గా పని చేశాను. నేను చదివిన పాఠశాలను ఎప్పటికీ మరువలేను. సొంత ఊర్లో చదివిన పాఠశాలకు ఎంతో కొంత నా వంతుగా సహాయం చేయడం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి. తల్లిదండ్రుల కష్టాన్ని ఎన్నటికీ మరువకూడదు.

– భవానీ ప్రసాద్, మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్

జిల్లాకే ఆదర్శంగా నిలుపుతాం



ప్రతి సంవత్సరం ఏదో ఒక పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తుంటారు. చదివిన పాఠశాలకు ఏదో ఒకటి తమ బ్యాచ్‌కు గుర్తుగా ఉండాలని సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మాది 1992–93 పదో తరగతి బ్యాచ్. 80 మంది కలసి రూ.3.50 లక్షలతో పాఠశాల గేట్, ముఖద్వారం ఏర్పాటు చేయించాం. ఇలా ఒకరిని చూసి మరొకరు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకొస్తున్నారు. పూర్వ విద్యార్థులంతా కలసి ఆత్మకూరు ఉన్నత పాఠశాలను జిల్లాకే ఆదర్శంగా నిలుపుతాం.

– శ్రీధర్, పూర్వ విద్యార్థి

అభివృద్ధి చేయడం సంతోషదాయకం



నేను ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో చదివాను. నేను గత పాతిక సంవత్సరాలకు పైగా ప్రైవేటు ట్యూషన్‌లు చెబుతూ.. కొద్ది సంవత్సరాలుగా ఆత్మకూరు ఉన్నత పాఠశాలలోనే డ్రాయింగ్ టీచర్‌గా, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాను. ప్రతి సంవత్సరం ఏదో ఒక పదవ తరగతి బ్యాచ్ లేదా, పూర్వ విద్యార్థులు పాఠశాలలో అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. ఇది చాలా సంతోషకరమైన విషయం. మరింత మంది విద్యార్థులు తమవంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టాలి.

– నారాయణ స్వామి, పూర్వ విద్యార్థి

నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు



కమిషనర్‌తో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుందామని మేయర్ వసీం అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం తన చాంబర్‌లో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు తదితరులతో సమావేశమయ్యారు. త్వరలో జరగబోయే కౌన్సిల్ సమావేశంపై చర్చించారు. అజెండాలో అభివృద్ధి పనులు, కార్మికుల సమస్యలు తదితర వాటిపై చర్చించాలన్నారు. 2022–23, 2023–24 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన 10 అభివృద్ధి పనులు (రూ.4.2 కోట్లు), స్టాండింగ్ కమిటీ ఆమోదించిన రూ.9 కోట్లకు సంబంధించి 33 పనులు అజెండాలో చేర్చినట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో కౌన్సిల్‌ను నిర్వహించారన్నారు. మిగతా సమయంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చని డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సమావేశంలో ఈఈ షాకీర్, ఏసీపీ శ్రీనివాసులు, కార్పొరేటర్లు బాలాంజనేయులు, శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే కుళ్లాయస్వామి పాల్గొన్నారు.

హింసలేని సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

అనంతపురం అర్బన్: హింసలేని సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అంతర్జాతీయ స్త్రీ హింసా నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన స్థానిక టవర్‌క్లాక్ వద్ద ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల హక్కులను కాపాడకుండా హింసలేని సమాజాన్ని నిర్మించలేమన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయన్నారు. ఇందుకు ముఖ్య కారణంగా మాదకద్రవ్యాలు, మద్యం, అశ్లీల చిత్రాలు పోర్న్ వంటి వాటివల్ల యువత పెడదోవ పడుతోందన్నారు. ప్రతి జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. డిసెంబర్ 10వ తేదీ వరకు ఉన్నత పాఠశాలల్లో హింస వ్యతిరేకంపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లక్ష్మీనరసమ్మ, సుశీల, మహాలక్ష్మి, అనిత, తులసి, కుమారి, హబానా, మాబి, వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు పాల్గొన్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం కల్చరల్: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే సపోజ్ క్రిస్మస్ వేడుకలు నెల రోజుల ముందుగా ప్రారంభమయ్యాయి. సండే స్కూల్ చిన్నారుల ఆటపాటలు, భక్తిగీతాలాపనలు, లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ చర్చిలో పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు రాకడ గురించి తన సందేశంలో వివరించారు. అరవింద నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ బెన్‌హర్ బాబు బైబిల్ వాక్యాలను వివరించారు. కళాకారుల కాలనీలోని రేమాచర్చిలో పాస్టర్ మనుష్యే వాక్యోపదేశం చేశారు. అరవిందనగర్ జీసెస్ కంపాషన్ చర్చి, జీసెస్‌నగర్ హెర్మోన్ చర్చి తదితర చోట్ల సపోజ్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

అనంతపురం: రాబోయే 5 సంవత్సరాల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ‘పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్’ ప్రారంభమైనట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని ఆడిటోరియంలో భారత జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పథకం ప్రారంభించగానే రికార్డు స్థాయిలో 1.55 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. మన దేశంలోని 500 అగ్రగామి కంపెనీల్లో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా యువత ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు మోదీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ కృష్ణ, బీజేపీ నాయకులు లలిత్ కుమార్, చార్లెస్ చిరంజీవి రెడ్డి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, మనోహర్, సాయినాథ్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శాంతకుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

అనంతపురం కల్చరల్/ఆత్మకూరు/రాప్తాడు: కార్తీక మాసోత్సవాల్లో చివరి సోమవారం భక్తజనం శివాలయాలకు పోటెత్తారు. కార్తీక కాంతులతో శివాలయాలు కాంతులీనాయి. తెల్లవారుజామున నుంచే మహాశివుడికి ఏకవార రుద్రాభిషేకాలు ప్రారంభమయ్యాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు శివుడికి పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. శంభో శంకరా.. అంటూ స్వామిని కొలిచారు.



రాప్తాడులో శివలింగం ఆకారంలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు



రామేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తిగీతాలాపన



అనంతపురంలో దీపారాధన చేస్తున్న మహిళలు

పౌష్టికాహారం తీసుకోండి

ఆత్మకూరు: ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. సోమవారం మండలంలోని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అనీమియా పరీక్షలు నిర్వహించారు. రక్తశాతం తక్కువగా ఉన్న వారు ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తులసమ్మ, ప్రీతి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రాప్తాడు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అంగన్‌వాడీ కార్యకర్త యల్లమ్మ పేర్కొన్నారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్–1 అంగన్‌వాడీ కేంద్రం సక్షం (స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కింద ఎంపిక కావడంతో అంగన్ వాడీ కేంద్రం వద్ద ఇనుప కంచె ఏర్పాటు చేయించి మొక్కలు నాటారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పోషకాహారం అందించేందుకు పోషకాల తోటను పెంచుతున్నామన్నారు. పోషకాల తోటలో ముఖ్యంగా పాలకూర, మెంతి, తోటకూర, శతావరి, బ్రహ్మ, పునర్నవ, ఔషధ మొక్కలతో పాటు పండ్ల మొక్కలు, మునగ, బొప్పాయి, కరివేపాకు, నిమ్మ చెట్లను నాటుతామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

‘సమగ్ర’ సూపరింటెండెంట్‌గా ఇక్బాల్



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయ సూపరింటెండెంట్‌గా వైఎస్సార్ జిల్లా కడప డీఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న మహమ్మద్ ఇక్బాల్ బాషా నియమితులయ్యారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ప్రదీప్‌కుమార్‌ను కడప డీఈఓ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మహమ్మద్ ఇక్బాల్‌బాషా గతంలో సమగ్ర శిక్ష కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై కడప డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రదీప్‌కుమార్ సుదీర్ఘంగా ఇక్కడే పని చేస్తుండడంతో రానున్న బదిలీల్లో తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇద్దరి వినతులను పరిగణనలోకి తీసుకుని పరస్పర బదిలీ చేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు మూడు రోజుల్లో ఇద్దరూ రిలీవ్ అయి కొత్త స్థానాల్లో చేరనున్నారు.

నర్స్ అదృశ్యం

అనంతపురం: నగరంలోని ఆనంద్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న జి.మేఘన (24) అదృశ్యమైనట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. మేఘన భర్త జి.హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన జి.నరసింహులు కుమారుడు జి.హరి అనంతపురం నగరంలోని షిరిడీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. హరి వృత్తిరీత్యా డ్రైవర్ కావడంతో విధులకు వెళ్లారు. మేఘన ఇటీవలే ఆసుపత్రిలో నర్సుగా జాయిన్ అయ్యారు. ఆదివారం ఆరోగ్యం సరిగా లేదని ఇంటికి వెళ్తున్నట్లు తోటి సిబ్బందికి చెప్పి వెళ్లిన మేఘన.. ఇంటికి వెళ్లకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

3న రేణుకా యల్లమ్మ సొసైటీ ఎన్నికలు

రాప్తాడు రూరల్/అనంతపురం: అనంతపురం రూరల్ పరిధిలోని రాయల్‌నగర్‌లోని రేణుకా యల్లమ్మ ఆలయానికి అనుబంధంగా ఉన్న రేణుకా యల్లమ్మ సోషల్, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్ష పదవికి డిసెంబరు 3న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు ముగ్గురు సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డాక్టర్ శంకర్‌గౌడ్, ఇరిగేషన్ రిటైర్డ్ ఎస్ఈ హరిబాబు, సెర సంస్థ అధ్యక్షుడు కుళ్లాయి స్వామి ఉన్నారు. 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్.. 3 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందని సమన్వయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యక్షంగా ఎన్నికల్లో పాల్గొనలేని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పోస్టల్ బ్యాలెట్ అందజేయాల్సి ఉంటుందన్నారు. ఓటు హక్కు కలిగిన సభ్యులందరూ గుర్తింపు కోసం ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ఈనెల 27 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్ వేయాల్సి ఉంటుందన్నారు. పోటీ చేయడానికి సొసైటీ సభ్యులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. 28న మధ్యాహ్నం ఒంటిగంట లోపు నామినేషన్ ఉపసంహరించుకోవచ్చని వెల్లడించారు.

డబ్బు ఇప్పించాలని వినతి

అనంతపురం: డాక్టర్ ఎస్.గఫూర్, ఆయన కుమారుడు ఎస్.హర్షద్ అయూబ్‌కు ఇచ్చిన రూ.24 లక్షలు వెంటనే ఇప్పించాలని వెంకటలక్ష్మి (టీవీ టవర్, రామకృష్ణ కాలనీ) కోరింది. సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. వివరాలు.. రాంనగర్‌లో అపార్ట్‌మెంట్ కడుతున్న సందర్భంలో డాక్టర్ ఎస్.గఫూర్, ఆయన కుమారుడు ఎస్.హర్షద్ అయూబ్‌కు 2022 సంవత్సరం నుంచి విడతల వారీగా రూ.24 లక్షలు అప్పుగా ఇచ్చింది. అలాగే 2023లో తీర్థయాత్రకు వెళ్లినప్పుడు ఆమె కుమార్తె ప్రియాంకను మభ్యపెట్టి 13 తులాల బంగారం తీసుకున్నారు. ఈ విషయంపై వెంకటలక్ష్మి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రెడ్డప్ప.. గఫూర్, కుమారుడు హర్షద్ అయూబ్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అక్టోబర్ 15న డబ్బు చెల్లిస్తామని డాక్టర్ ఎస్.గఫూర్, ఆయన కుమారుడు హామీ ఇచ్చారు. నవంబర్ 4న హర్షద్ అయూబ్ ఆత్మహత్య చేసుకోవడంతో డబ్బు చెల్లించలేదు. తన కుమార్తె పెళ్లి నిశ్చయం కావడంతో వెంటనే డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బాధితురాలు వెంకటలక్ష్మి కోరుతోంది.

మహాధర్నాకు తరలిరండి

ఆత్మకూరు: జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ , నాయకులు రామాంజనేయులు, గోపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.